ప్రజాశక్తి
ఆదివారం 27 నవంబర్ 2022
5
కర్నూలు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- అంబేద్కర్‌కు ఘనంగా నివాళులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భారత రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకొని కర్నూలు నగరంలోని పలు విద్యాసంస్థల్లో, పరిపాలన కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా రాజ్యాంగ రూపకర్త డా.బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

సమన్యాయం కల్పించడమే లక్ష్యం
- కలెక్టర్ పి.కోటేశ్వర రావు

సమాజంలోని పౌరులందరికీ సామాజిక, రాజకీయ, ఆర్థిక సమన్యాయం అందించడమే రాజ్యాంగ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులచే రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఇంఛార్జి డిఆర్ఓ మల్లికార్జునుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్

రాజ్యాంగంను ప్రతి ఒక్కరు గౌరవించాలి

ప్రతి భారతీయుడు మన రాజ్యాంగాన్ని గౌరవించాలని డాక్టర్ ఎస్.మన్సూర్ రెహమాన్ అన్నారు. డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియా – ది మదర్ ఆఫ్ డెమోక్రసీ అనే అంశంపై ముఖ్యోపన్యాసం చేశారు. దేశ రాజ్యాంగ చరిత్ర, రాజ్యాంగ ప్రవేశిక, రాజ్యాంగంలోని షెడ్యూల్‌లు తదితర అంశాల పై పవర్ పాయింట్ ద్వారా విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆయన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులుతో కలిసి విద్యార్థుల చేత రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు.

సామాన్యులకు రాజ్యాంగ ఫలాలు అందాలి : సామాన్యులకు రాజ్యాంగ ఫలాలు అందితేనే రాజ్యాంగ స్ఫూర్తికి న్యాయం జరుగుతుందని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డివిఆర్ సాయిగోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ డివిఆర్ సాయి గోపాల్, జిల్లా జడ్జిలు షర్మిల భార్గవి పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో

జిల్లా పోలీసు కార్యాలయం (డిపిఒ) పేరడ్ మైదానంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్ డి.ప్రసాద్, ఎఆర్ అడిషనల్ ఎస్పి జి.నాగబాబు రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అడిషనల్ ఎస్పి అడ్మిన్ డి.ప్రసాద్, ఎఆర్ అడిషనల్ ఎస్పి జి నాగబాబు మాట్లాడారు. రాజ్యాంగ దినోత్సవం ప్రాధాన్యతను వివరించి , భారత రాజ్యాంగం పీఠిక ను చదివి వినిపించి పోలీసు అధికారులు , సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. డిఎస్పిలు, సిఐలు స్పెషల్ పార్టీ పోలీసులు, డిపిఒ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

డిపిఒలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పోలీసు అధికారులు

ఉర్దూ యూనివర్సిటీలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మాట్లాడుతున్న ఇసి పరిశీలకులు మురళీధర్ రెడ్డి

బోగస్ ఓట్లు నమోదు కాకుండా చూడాలి

- అఖిలపక్ష పార్టీలు - ఓటర్ నమోదు సవరణకు సహకరించండి
- ఇసి పరిశీలకులు మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓటర్ జాబితా సవరణలో బోగస్ ఓట్లు నమోదు కాకుండా చూడాలని అఖిలపక్ష పార్టీలు రాష్ట్ర ఎన్నికల సంఘం పరిశీలకుడిని కోరారు. శనివారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై అఖిలపక్ష పార్టీలతో రాష్ట్ర ఎన్నికల సంఘం పరిశీలకుడు మురళీధర్ రెడ్డి సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి ఓటరు జాబితా అబ్జర్వరు డి.మురళీధర్ రెడ్డి ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నుండి కరుణాకర్, సిపిఎం నుండి కెవి నారాయణ ఎం. రాజశేఖర్, బిజెపి నుండి నరసింహావర్మ, టిడిపి నుండి జస్వంత్ పాల్గొన్నారు. సిపిఎం ప్రతినిధులు మాట్లాడుతూ ఓటర్ నమోదు సవరణలో అర్హులైన వారిని మాత్రమే నమోదు చేయాలన్నారు. ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న ఓటర్లను అక్కడే నమోదు చేసేలా చూడాలన్నారు. ఇతర పార్టీల నేతలు మాట్లాడుతూ ఓటర్ నమోదు కార్యక్రమంపై అవగాహన నిర్వహించాలని కోరారు. ఎన్నికల సంఘం పరిశీలకుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎలక్టోరల్ రోల్ అప్‌డేట్ చేస్తూనే ఉంటామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం జరుగుతోందన్నారు. వంద శాతం ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతపై ప్రత్యేక దృష్టి పెట్టి ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు.. ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ కళాశాలల్లో క్యాంపెయిన్ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఆధార్–ఓటర్ కార్డు అనుసంధానం చేసే కార్యక్రమం జరుగుతుందని, అను సంధానం వల్ల డూప్లికేట్ ఓట్లకు అవకాశం ఉండదని అన్నారు. ఏవైనా సమస్యలుంటే తెలియచేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బిఎల్ఒలతో సమన్వయం చేసుకునేందుకు వీలుగా రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో ఇంఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, ఇఆర్ ఒలు, ఎఇఆర్ఒలు, ఎలక్షన్ సూపరింటెండెంట్ మురళి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కెవిపిఎస్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ శనివారం కర్నూలు నగరంలో ప్రజానాట్యమండలి కళాకారులు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా "ఉన్నది ఊరి బయట దాని పేరే మాల పేట, మాదిగ పేట." "కుల వివక్ష వ్యతిరేక సంఘం దళిత హక్కుల కోసం చేస్తున్నది పోరాటం". అంటూ గేయాలు ఆలపిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు సుబ్బరాయుడు, సుంకన్న, బజారి, జీవన్‌లు పాల్గొన్నారు.

పాటల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న పిఎస్ఎం బృందం

'నీటి'పై నిర్లక్ష్యం...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

శ్రీశైలం జలాశయం నీటి మట్టం 875.300 అడుగులకు చేరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వివిధ సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రోజుకు 3 నుంచి 5 టిఎంసిలు వాడుతున్నాయి. దీంతో రోజు రోజుకూ జలాశయంలో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. నీటి వినియోగం ఇలాగే కొనసాగితే డిసెంబరు ఆఖరుకు లేదా జనవరి 15నాటికి 798 అడుగులు దిగువకు పడిపోయే అవకాశం ఉంది. జలాశయంలో 810 అడుగుల లెవల్ వరకు మాత్రమే హంద్రీ నీవా, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల నుంచి నీరు ఎత్తిపోసే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో జనవరి తరువాత హంద్రీ నీవా కాలువకు నీరు ఇచ్చే అవకాశమే లేదని పత్తికొండ, దేవనకొండ, గోనెగండ్ల, కృష్ణగిరి, తుగ్గలి మండలాల తహసీల్దారులకు ఇరిగేషన్ అధికారి లేఖ రాశారు. గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో ఈ మేరకు నోటీసులు అంటించాలని, దండోరా వేయించాలని ఆ లేఖలో ఆదేశించారు. హంద్రీనీవా ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 11.5 టిఎంసిలే ఎత్తిపోశారు. గత టిడిపి ప్రభుత్వంలో ఐదేళ్లు సగటున 30–35 టిఎంసిల వరకు కృష్ణా జలాలు ఎత్తిపోసి కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని కరువు పల్లెలకు ఫిబ్రవరి, మార్చి ఆఖరు వరకు సాగు, తాగునీరు ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక కూడా 2020లో 40 టిఎంసిలు, 2021లో 28 టిఎంసిలు ఎత్తిపోశారు. కృష్ణగిరి, జూపాడుబంగ్లా, పత్తికొండ, వెల్దుర్తి, కల్లూరు, మద్దికెర మండలాల్లో హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి మోటర్ల ద్వారా ఎత్తిపోతలు, పందికోన జలాశయం పరిధిలో దేవనకొండ, పత్తికొండ మండలాల్లో దాదాపుగా 35 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగులో ఉన్నాయి. రబీ ఆశతో నెల నెలన్నర రోజుల క్రితమే వేరుశనగ, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారు.

చలి పంజా : జిల్లాలో చలి పంజా విసురుతోంది. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగింది. రెండ్రోజుల కిందట రాత్రివేళల్లోనే చలి ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఉదయం కూడా ప్రభావం చూపుతోంది. రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు బయటికి రావాలంటే ప్రజలు గజగజ వణికిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచి రోడ్లను మంచు కప్పివేస్తోంది. చలికాలంలో చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు పలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, ఆస్తమా, గుండె సంబంధ వ్యాధులు ఉన్న వాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. చలికి బయట తిరగకుండా జాగ్రత్తగా ఉండాలని, ఇంటిలోనూ చలి తీవ్రత పెరిగితే వేడి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

బకాయిలపై ఆందోళన : తమ ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటూ ఒకవైపు బూటకపు ప్రచారం చేసుకుంటూ మరోవైపున ఉద్యోగులకు ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయడం లేదు. ఉద్యోగులకు ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన న్యాయబద్ధమైన అరియర్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా అలసత్వం వహిస్తోంది. మరోవైపున సంక్షేమ పథకాలకు మాత్రం పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేస్తోంది. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు ఇతరత్రా ఆర్థిక పరమైన బిల్లులను చెల్లించడం లేదు. బకాయిలు విడుదల చేయాలని యుటిఎఫ్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన పిఆర్‌సి వల్ల ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదని నాయకులు పేర్కొన్నారు.

పాత జాబితాకే : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో చేపట్టిన అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టుల నియామకాల్లో భారీగా అవకతవకలు చోటుకున్నట్లు ఆరోపణలు రావడంతో దానిపై మెరిట్ జాబితాలో పేర్లు లేని వారు, ఉన్న వారు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పాత మెరిట్ జాబితాకే హై కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో నియామకాలపై మళ్లీ ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

ఎన్ఇపిని రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

46వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం ప్రదేశపెట్టిన నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోనీ కార్మిక కర్షక భవన్లో ఎస్ఎఫ్ఐ కర్నూలు మండలం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రాఘవేంద్ర, మాట్లాడుతూ డిసెంబర్ రెండో తేదీన ఎమ్మిగనూరు పట్టణంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 46వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యా వ్యతిరేక విధానాలు, అవలంబిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన, జాతీయ నూతన విద్యా విధానం, పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు చదువును దూరం చేసే విధంగా ఉందన్నారు. వెంటనే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా, విద్యార్థులందరూ ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం కర్నూలు మండలం ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని, అధ్యక్ష కార్యదర్శులు అశోక్, అంజిలతో పాటు మరో 15 మందిని ఎన్నుకున్నారు.

నేడు బాలసాయి బాబా ఆరాధనోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : బలసాయి బాబా వారి ఆరాధన ఉత్సవంలో భాగంగా పూజ కార్యక్రమం ఆదివారం ఉదయం 7 గంటల నుండి బాలసాయి బాబా ఆశ్రమం, శ్రీ నిలయం, కర్నూలులో కార్యక్రమాలు జరుగునని బలసాయి మేనేజింగ్ ట్రస్టీ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పూజ కార్యక్రమాలు బాబావారి అభిషేకం, శ్రీ చక్రార్చన గణపతి పూజ, మన్యు హవనం ,మన్యు సూక్త పారాయణం, హోమం మన్యు వరాహ లక్ష్మీనరసింహ పాశుపదాస్త్ర హోమం మహా పూర్ణాహుతి వేద ఆశీర్వచనం నిర్వహిస్తామన్నారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాదా వితరణ ఉంటుందని అందరూ ఆహ్వానితులని తెలిపారు. హోమాలలో పాల్గొనే భక్తులు అందురూ తమ పేర్లను 9885092111 ముందుగానే నమోదు చేసుకోవాలన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దాం

రాజ్యాంగ దినోత్సవ సభలలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాజ్యాంగ నిర్మాణం వెనక ఎన్నో పోరాటాలు, ఆకాంక్షలు, సామాజిక విప్లవ అభినివేశాలు ఉన్నాయన్నాయని లీడర్స్ యూత్ సొసైటీ, నల్లారెడ్డి ఫౌండేషన్ కేదార్‌నాథ్, కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ. హఫీజ్ ఖాన్ తెలిపారు. శనివారం కేదార్నాథ్ తో కలిసి కర్నూలు పాత బస్టాండ్‌లో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే తదితరులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ 1949 నవంబర్ 26 భారత రాజ్యాంగం ఆమోదం పొందిందన్నారు. నేటికి 73ఏళ్లు గడిచినా భారత కరెన్సీపై అంబేద్కర్ ముఖచిత్రాన్ని ముద్రించటం లేదన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 25 మంది గవర్నర్లు మారినా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు గౌరవం దక్కలేదని వాపోయారు. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ కాలం 3 సంవత్సరాల మథనం, 165 రోజులు, అధికరణలు 395, షెడ్యూళ్లు 12తో కూడిన శ్రమకు ఆమోదం లభించిన రోజు ఇది అన్నారు. 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిందన్నారు. వికేంద్రీకరణకు మద్దత్తు ఇవ్వని చంద్రబాబు నాయుడు ఆంధ్ర రాష్ట్ర ద్రోహిఅని అన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలోని డ్రాఫ్ట్ కమిటీ ఆధ్వర్యంలో మన దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించేందుకు పలువురు విద్యావేత్తలు, న్యాయనిపుణులు, వివిధ రంగాల ప్రముఖులతో రాజ్యాంగ నిర్మాణ సభను ఏర్పాటు చేసి ఈ రాజ్యాంగాన్ని రూపొందించారని అన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరికీ సమాన హక్కులు కల్పించి, ప్రతి ఒక్కరికి రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమన్యాయం ఉండాలని భారత రాజ్యాంగాన్ని నిర్మించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తి శాచ్యురేషన్ పద్ధతిలో, అత్యంత పారదర్శకంగా, అవినీతీ, వివక్షా లేకుండా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా చర్యలు చేపట్టిందని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత సమాజానికి అత్యుత్తమమైన, పటిష్టమైన రాజ్యాంగాన్ని అందించిన మహోన్నతుడు, 'విశ్వ మానవుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బెస్త అనిల్, మధు, ఆది శేషు, వసంత్, జేశ్వంత్, బంటుపల్లి రాజేష్, రాజు, హరి, రమేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్,తదితరులు

జడ్‌పిలో రాజ్యాంగదినోత్సవం

కర్నూలు అగ్రికల్చర్ : జిల్లా ప్రజా పరిషత్తు కార్యాలయంలో శనివారం రాజ్యాంగదినోత్సవాన్ని ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఇ.వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం భారత రాజ్యాంగ సంవిధాన్ దివస్ ప్రాముఖ్యతను , రాజ్యాంగములో పొందుపరిచిన విలువలను అందులో నిబిడీకృతమైన ఆదేశిక సూత్రాల భావజాలాన్ని సిబ్బందికి వివరించారు. సిబ్బంది చేత 'రాజ్యాంగ ప్రవేశికను'పఠింపచేశారు. కార్యాలయ వివిధ విభాగాల పరిపాలనా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎపిఎస్‌సి, ఎస్‌టి లాయర్స్ ఫోరం ఆధ్వర్యంలో...

కర్నూలు కార్పొరేషన్ : ఎపిఎస్‌సి, ఎస్‌టి లాయర్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం 73 వ జాతీయ రాజ్యాంగ దినోత్సవం పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. కర్నూలు సీనియర్ న్యాయవాది, ఎపి ఎస్సీ ఎస్టీ లాయర్స్ ఫోరం అధ్యక్షులు వై.జయరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా భారత రాజ్యంలో ఉన్న హక్కులు బాధ్యతలను అందరం సక్రమంగా నిర్వర్తిస్తూ తూచా తప్పకుండా పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

భారత రాజ్యాంగాన్ని అనుసరించి నడుచుకుందాం

రాజ్యాంగ స్ఫూర్తితో కుల,మత,వర్గ,వర్ణజాతి, లింగ భేదము లేకుండా రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల సమర్పించి అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులు, విధులు గురించి వివరించారు. చైర్మన్ మద్దూర్ సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి ప్రకాష్ అధ్యక్షత వహించారు..

శ్రీశంకరాస్ డిగ్రీ కళాశాలలో....

శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల అకాడమిక్ అడ్వైజర్ వసంత కుమారి మాట్లాడుతూ భారతీయ పౌరులందరూ రాజ్యాంగ విలువలను కాపాడాలన్నారు. భావితరాలకు రాజ్యాంగ విలువలను, తెలియజేసే బాధ్యత అందరి పైన ఉన్నదని, విద్యార్థులకు తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మద్దిలేటి మాట్లాడుతూ విద్యార్థులందరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, అప్పుడే సమాజంలో అందరు కూడా నివార్తిస్తారని తెలిపారు.

కోడుమూరులో

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో

జిల్లా పేరిషత్ కార్యాలయంలో

విద్యార్థుల నృత్యం ప్రదర్శన (వేడుకలను ప్రారంభిస్తున్న కోర్ డీన్ లింగేశ్వర్‌రెడ్డి)

నారాయణ లో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు జరుపుకున్నారు. ముఖ్యఅతిథి నారాయణ కళాశాల కోర్ డీన్ లింగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు ఇతర అంశాలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఎంసెట్ , జెఇఇ మెయిన్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. కళాశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేపట్టి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎం గోవర్ధన్ రెడ్డి, కళాశాల డీన్ నాగరాజు, ప్రిన్సిపల్ విజయ్ మోహన్ విద్యార్థులు పాల్గొన్నారు

ముడుమాల గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎస్‌పి మహేష్

పందుల నివారణకు ప్రత్యేక దృష్టి : డిఎస్‌పి

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలో పందుల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని డిఎస్‌పి కెవి.మహేష్ పోలీసులకు ఆదేశించారు. శనివారం కోడుమూరు సిఐ శ్రీధర్ తో వెళ్లి ఎస్ఐ పీరయ్య అధ్యక్షతన పలురికార్డులు తనిఖీ చేసి పలు కేసులపై పూర్వపరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడే ముడుమాల, బెళగల్ గ్రామస్తులు పందుల సంచారంతో బేంబేలెత్తిపోతున్నామని రోగాలతో అస్పత్రుల పాలవుతున్నామని డిఎస్‌పితో వాపోయారు. ఈ సందర్భంగా మండలంలో కేసులు తగ్గాయాని ఏడాదిగా 190 కేసులలో 51 కేసులు రాజీ అయినట్లు పేర్కొన్నారు. ఇసుక, ఎర్రమట్టి, మద్యం అక్రమ రవాణా నివారణకు నిఘానేత్రాలు తప్పక ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి

- ఎంపిడిఒ ఆంటోని

ప్రజాశక్తి - హాలహర్వి

నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఆంటోని

జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఆంటోని తెలిపారు. శనివారం హాలహర్వి మండల ప్రజా పరిషత్ కార్యలయంలో సచివాలయ అధికారులు, హౌసింగ్ ఎఇ, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హౌసింగ్ డిఇ భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఆంటోని మాట్లాడారు. జగనన్న ఇంటి నిర్మాణాలను డిసెంబర్ 21లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇల్లు నిర్మాణ నాణ్యతలో రాజీ పడవద్దని తెలిపారు. వీలైనంత సమయం ఎక్కువ కేటాయించాలని సూచించారు. లేఅవుట్‌లో ఇంటి నిర్మాణం పూర్తయ్యే సరికి డ్రెయినేజీలు, విద్యుత్ సదుపాయం కల్పించాలని తెలిపారు. అనంతరం జె.హోసళ్లి, గూళ్యం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. ఎఇ శరణబసప్ప, వర్క్ ఇన్‌స్పెక్టర్ గాదిలింగప్ప, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చంద్రబాబు, మహబూబ్ బాష, శివయ్య, రంగస్వామి, రామకృష్ణ, డిజిటల్ అసిస్టెంట్ గౌతమి, సునీల్, వాణి, అరుణ జ్యోతి, వాసవి, వెల్ఫేర్ అసిస్టెంట్లు రోషన్ వలీ, శివరాం, రాజశేఖర్, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

- ఎంపిడిఒ గీతావాణి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

జగనన్న ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ గీతావాణి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ గీతావాణి ఆదేశించారు. శనివారం మండలంలోని ఢణాపురం, నాగనాథనహళ్లి గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి కావాలని తెలిపారు. అధికారులు ఈ దిశగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జగనన్న కాలనీల్లో ఇంకా ఎవరైనా ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టకపోతే పట్టా రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

- సర్పంచి అయ్యమ్మ - ఆకస్మికంగా సచివాలయాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

రికార్డులను పరిశీలిస్తున్న సర్పంచి అయ్యమ్మ

కోసిగి మేజర్ పంచాయతీ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సర్పంచి అయ్యమ్మ తెలిపారు. శనివారం కోసిగిలోని 5 గ్రామ సచివాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాలు మేరకు సచివాలయ సిబ్బంది పనితీరును తెలుసుకోవడంలో భాగంగా సచివాలయాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రతి సచివాలయంలోనూ సిబ్బంది సెలవుల విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్ర, శనివారం వస్తే చాలు సచివాలయ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసిందని అన్నారు. ప్రతి సచివాలయంలోనూ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. వైసిపి యువజన నాయకులు ఎస్.రాజేష్ పాల్గొన్నారు.

వైసిపి పాలకులకు బుద్ధి చెప్పండి

- జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప

ప్రజాశక్తి - దేవనకొండ

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వెంకప్ప

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయక, సమస్యలు పరిష్కరించని వైసిపి పాలకులకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని జనసేన పార్టీ ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నెకల్లు వెంకప్ప కోరారు. శనివారం దేవనకొండ ఎస్సీ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీకి చెందిన మహిళలు మాట్లాడుతూ... కాలనీలో సిసి రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం చేపట్టిన 'గడపగడపకు' ఎక్కడ చేస్తున్నారని, గాలిలో చేస్తున్నారా అని ప్రశ్నించారు. జనసేన పార్టీని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అనంతరం జగనన్న కాలనీలను పరిశీలించారు. జనసేన పార్టీ నాయకులు మక్బూల్, బడేసాబ్, ఆంథోని, నాగరాజ్ పాల్గొన్నారు.

కదం తొక్కిన ట్రాన్స్‌కో గ్రేడ్-2 జెఎల్ఎంలు

ప్రజాశక్తి - ఆదోని

ప్రమాదకరమైన పనులు చేయిస్తూ, విద్యుత్ అధికారులు తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని గ్రేడ్-2 జెఎల్ఎంలు కదం తొక్కారు. శనివారం ఆదోనిలో మున్సిపల్ మైదానం నుంచి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ మైదానం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అక్కడ నినాదాలు చేస్తూ వారి సమస్యలను సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. అక్కడి నుంచి విద్యుత్ భవన్‌కు చేరుకొని భారీఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, గ్రేడ్-2 జెఎల్ఎం అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి నాగన్న మాట్లాడారు. విద్యుత్ స్తంభం ఎక్కడం, దిగడం, తీగల మరమ్మతు పనులు తమతో చేయిస్తూ ప్రాణాలతో చెలగాటమడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు గ్రేడ్-2 జెఎల్ఎంలు విద్యుదాఘాతానికి గురై 100 మంది దాకా మృతి చెందారని తెలిపారు. 200 మంది దాకా ప్రమాదాల బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కోసిగి మండలం సాతనూరు వద్ద రాము నాయక్ అనే గ్రేడ్-2 జెఎల్ఎం విద్యుత్ మరమ్మతు పనులు చేస్తూ విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ కర్నూలు ఆస్పత్రిలో మృతి చెందారని తెలిపారు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయమూ అందలేదన్నారు. ఛాంబర్‌లో ఉన్న విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీ బాబుకు వినతిపత్రం ఇచ్చారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీఇచ్చారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, గ్రేడ్-2 జెఎల్ఎంల అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగరాజు, ట్రెజరర్ రసూల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు రాముడు, రాజశేఖర్, ప్రదీప్, భాస్కర్, ఈరన్న పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో భవన్ ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నాణ్యమైన చేపలు అందించడమే లక్ష్యం

- ఫిషర్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నాణ్యమైన చేపలు అందించడమే తమ లక్ష్యమని ఫిషర్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. మత్స్యకారులను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ఆదోని నియోజకవర్గ పరిధిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకందారులను ప్రోత్సహించడం, వినియోగదారులకు పరిశుభ్రమైన చేపల విక్రయాలను ప్రోత్సహించడం ఫిష్ ఆంధ్ర బ్రాండ్ కింద ప్రస్తుతం ఉన్న చేపల దుకాణాలను మినీ రిటైల్ అవుట్ లెట్లుగా మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర అవుట్ లెట్లను ఆదోని పట్టణంలో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో ఫిష్ ఆంధ్ర షాపులను ప్రారంభించిందని చెప్పారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం కొత్తగా మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్లను తీసుకొచ్చిందన్నారు. మన చేప -మన ఆరోగ్యం అన్న నినాదంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో లబ్ధిదారుడు కేవలం బ్యాంకు ఖాతాలో రూ.30వేలు డిపాజిట్ చేస్తే మిగిలిన సొమ్మును బ్యాంక్ ద్వారా రుణాలను అందిస్తామన్నారు. దీంతో సొంతంగా మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లను పెట్టుకుని వ్యాపారం చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. మరిన్ని వివరాలకు 8309776847, 8142069858 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సకాలంలో హౌసింగ్ బిల్లులు

- ప్రత్యేకాధికారి, పిఆర్ డిఇ శ్రీరాములు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లోని ఇంటి నిర్మాణ లబ్ధిదారులకు బిల్లులను సకాలంలో ప్రభుత్వం చెల్లిస్తోందని మండల ప్రత్యేకాధికారి, పిఆర్ డిఇ శ్రీరాములు తెలిపారు. శనివారం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రామదుర్గం గ్రామంలో జగనన్న కాలనీలో నిర్మాణాలు వేగవంతం చేశారని తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో కూడా నిర్మాణాలు వేగవంతం చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇఒఆర్‌డి సంజన, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్‌నీలా, ఎపిఎం నాగార్జున పాల్గొన్నారు.

మండల కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్న శ్రీరాములు

జగనన్న గోరుముద్దలో నాణ్యత ఉండాలి

విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్దలో నాణ్యత ఉండేలా చూసుకోవాలని వంట నిర్వాహకులకు శ్రీరాములు సూచించారు. సర్పంచి నీలకంఠ, పంచాయతీ కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో సచివాలయ కార్యాలయంలో అధికారుల పనితీరు, అంగన్వాడీ కేంద్రం, జగనన్న కాలనీలో హౌసింగ్ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇఒఆర్‌డి సంజన్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్ నీలా, ఎపిఎం నాగార్జున పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో సోమిశెట్టి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు శనివారం దర్శించుకున్నారు. దర్శనార్థం శ్రీమఠం చేరుకున్న ఆయనకు టిడిపి నాయకులు స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆయనకు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీమఠం ఎఎఒ మాధవ్ శెట్టి, సహాయక మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, కార్యకర్తలు వట్టేప్ప గారి నరసింహ ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి

ఎమ్మెల్యే చిత్తశుద్ధి చాటుకోవాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రదర్శన

ప్రజాశక్తి - ఆదోని

డివిజన్ కేంద్రమైన ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఇచ్చిన మాటను నిలుపుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ 5వ పట్టణ మహాసభల సందర్భంగా మున్సిపల్ మెయిన్ రోడ్డులో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడారు. దాదాపు 12 వేల మంది విద్యార్థులు ప్రతేడాది ఇంటర్ పూర్తి చేసి బయటకు వెళ్తున్నారని తెలిపారు. డిగ్రీ చదవాలంటే ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక, ప్రయివేట్ కళాశాలలో చదవలేక విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలు లేకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి ఎమ్మెల్యే చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున విద్యార్థులను కలుపుకొని ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మైనార్టీ ఐటిఐ కళాశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, గౌస్, గణేష్, రాజు, పవన్, భరత్, విష్ణు రాజు ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

విత్తనశుద్ధితో మంచి దిగుబడులు

- వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులపై పొలంబడి

ప్రజాశక్తి - హోళగుంద

వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా లోదుక్కులు, విత్తన శుద్ధి, రక్షక పంటలు, సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో మంచి దిగుబడులు సాధించవచ్చని ఆర్డిఓ సంస్థ నాగరాజు, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ పవన్ తెలిపారు. శనివారం హెబ్బటం గ్రామంలో శివప్ప పొలంలో పొలంబడి నిర్వహించారు. రిలయన్స్ ఫౌండేషన్ తులసి, పాటయ్య, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మౌలిక వసతులతో ఇళ్లు నిర్మించాలి

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కోరారు. శనివారం మండలంలోని రచ్చమర్రి గ్రామంలోని జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోలేని పేదలకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చొరవతో జెఎన్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఇళ్లు నిర్మించేందుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటి స్థలాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలపై హర్షం వ్యక్తం చేశారని తెలిపారు. అక్కడ నూతనంగా వేసిన బోరును పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన రహదారి అంగన్వాడీ కేంద్రం వద్ద నుంచి అడివమ్మ గారి సత్యప్ప ఇంటి వరకు రూ.1.5 లక్షలతో నూతనంగా రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో వేస్తున్న తాగునీటి పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. రిలయన్స్ సంస్థ కో ఆర్డినేటర్ భీమేష్‌ను అభినందించారు. అంతకుముందు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని స్థానిక నాయకులు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. వైసిపి మండల అధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, పిఎ వెంకట్రామి రెడ్డి, జడ్‌పిటిసి మజ్జిగ గోవిందమ్మ, మాజీ వైస్ ఎంపిపి వెంకోబా, సర్పంచి సుజాత, సీనియర్ నాయకులు రొగప్ప, లక్ష్మప్ప, బొజ్జప్ప, రవి రెడ్డి, లక్ష్మయ్య, రామాంజి, రాజు, డీలర్ బొజ్జప్ప, హనుమంతు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మెరుగైన సౌకర్యాలతో ప్రయాణికులను ఆకర్షించాలి

ఆర్‌టిసిలో మెరుగైన సౌకర్యాలు అందించి ప్రయాణికులను ఆకర్షించాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోరారు. ఆర్‌టిసి బస్టాండ్‌లో గుడెకల్ గ్రామానికి చెందిన అబ్దుల్ రహ్మాన్ ఎమ్మిగనూరు ఆర్‌టిసి తరుపున అద్దె బస్సును మంత్రాలయం నుంచి బెంగుళూరు (నాన్ ఎసి) సర్వీసును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఎమ్మెల్యే స్వయంగా బస్సును నడిపి ఉత్సహ పరిచారు. కొంత దూరం బస్సులో ప్రయాణించి సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌టిసి అధికారులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సన్మానించారు. డిప్యూటీ సిటిఎం వెంకటరమణ, ఆర్ఎం వెంకట్రామం, ఆదోని/ఎమ్మిగనూరు డిపో డిఎం మహ్మద్ రఫిక్, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

- కెవిపిఎస్ మండల కార్యదర్శి చిన్న మారయ్య

ప్రజాశక్తి - కౌతాళం

కెవిపిఎస్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి చిన్న మారయ్య కోరారు. శనివారం రాష్ట్ర మహాసభల గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితుల సామాజిక, రాజకీయ హక్కులను ప్రభుత్వాలు నెరవేర్చేలా పోరాటం చేయాలని తెలిపారు. దౌర్జన్యాలు, అంటరానితనం నిర్మూలించడానికి ఐక్యం కావాలన్నారు. డప్పు కళాకారులు, గుంతలు తీసే కార్మికులు, చర్మకారుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పింఛన్ల సాధన కోసం, భూహక్కు సాధన కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, ఉల్లిగయ్య, వలీ, కెవిపిఎస్ నాయకులు తాయప్ప, మారయ్య, వీరేష్ పాల్గొన్నారు.

మండల మహాసభలను జయప్రదం చేయండి

- ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు గురుప్రసాద్, పరమేష్

ప్రజాశక్తి - హోళగుంద

ఈ నెల 28న హోళగుంద ఎస్ఎఫ్ఐ 3వ మండల మహాసభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున, గురుప్రసాద్, పరమేష్ కోరారు. శనివారం హోళగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి వాటిని పరిష్కరించే విధంగా పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. హోళగుందలోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించి విద్యార్థులకు వసతి ఏర్పాటు చేయాలని కోరారు. హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రంలో ఏక్కడా లేని విధంగా నాలుగు మీడియాలు కలిగిన పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందంటే సిగ్గు చేటని తెలిపారు. మండల మహాసభ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యక్షులు గణేష్, సహాయ కార్యదర్శి నిత్య, కమిటీ సభ్యులు మహంతేష్, భాను, శిల్పా, సాయి ఈశ్వరి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం

- ఎపియుడబ్ల్యుజె

ప్రజాశక్తి-ఆలూరు

జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం చేసి సమస్యలను పరిష్కరించుకుందామని ఎపియుడబ్ల్యుజె జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమోహన్, శ్రీధర్ తెలిపారు. శనివారం గెస్ట్ హౌస్‌లో ఎపియుడబ్ల్యుజె ఆలూరు మండల కమిటీని జిల్లా ఉపాధ్యక్షులు స్వరూప్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా డానియేలు, అధ్యక్ష, కార్యదర్శులుగా వీరబద్రి, రాజు, ఉపాధ్యక్షులుగా గోపాల్, కోశాధికారిగా సాహెబ్ జాన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వీరేష్, సహాయ కార్యదర్శిగా జి.గోపాల్, స్వామి, కార్యవర్గ సభ్యులుగా భీమా, మల్లిస్వామి, అంజి, సూరి, జగదీష్ రెడ్డి, రామ్మోహన్, హనుమేష్, నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జర్నలిస్టులు చంద్రబాబు, రాజేష్, కృష్ణ, యశోద కుమార్ పాల్గొన్నారు.

దేశ పరిపాలన కోసం రచించిన మహాగ్రంథం

మంత్రాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళంలో నివాళులర్పిస్తున్న ప్రతిభ సిబ్బంది

గోనెగండ్లలో బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి - మంత్రాలయం

భారత రాజ్యాంగం దేశ పరిపాలన సౌలభ్యం కోసం ప్రణాళికతో రచించిన మహా గ్రంథమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శనివారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి, నాయకులు జనార్ధన్ రెడ్డి, జక్కయ్య, అబ్రహాం, సుందర్ రాజు, రాజు, కయ్యూం, ప్రభుదాస్, దేవదాసు, సల్మాన్ పాల్గొన్నారు. అలాగే జై భీమ్ ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ యోహాను మాదిగ, గర్జి హనుమంతప్ప మాదిగ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఉపాధ్యక్షులు రత్నం మాదిగ, నాయకులు అజయ్, ప్రకాష్, అచ్యుత్ రావు, జాన్, జై పాల్, యాకోబు, నరసింహులు పాల్గొన్నారు. **నందవరం**లో జై భీమ్ ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు శవాల బుజ్జిబాబు ఆధ్వర్యంలో పంచాయతీ ఆవరణలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి రంగ నాయకులు, మండల ఇన్‌ఛార్జీ చింపిరి చిన్న పోతప్ప, మండల ఉపాధ్యక్షులు ఎర్రన్న, మండల కార్యదర్శి ఎం.ఎర్రన్న, మండల నాయకులు భాస్కర్, సత్యానందం, గ్రామ అధ్యక్షులు బండారి మోజేష్, పి.సురేష్ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో మాల మహానాడు పట్టణ అధ్యక్షులు బబ్బిలి అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు కల్లుపోతుల సురేష్, నాయకులు తలారి రామాంజినేయులు, యూత్ నాయకులు నరసింహులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యవేదిక కన్వీనర్ నాగరాజు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి న్యాయవాది చంద్రయ్య, జిల్లా అధ్యక్షులు సాయిరాం, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు గిరి పాల్గొన్నారు. **ఆస్పరి**లోని నారాయణ ప్రైమ్ స్కూల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణ ప్రైమ్ స్కూల్ కరస్పాండెంట్ నరేష్ ఆచారి, పాఠశాల అకడమిక్ డీన్ సతీష్ కుమార్, ఉపాధ్యాయులు అరుణ, జ్యోత్స్న, రమ, శ్వేత, రేష్, గౌసియా, గంగమ్మ, శరత్, నారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ ఆంటోని, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఎపిఒ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి మల్లికార్జున, పంచాయతీ సెక్రటరీ ఈరన్న, శివ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** పట్టణంలోని వివిధ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ శాంతలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కౌతాళం**లోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ మైనుద్దీన్, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు ఈరన్న, భీమేష్, విరుపాక్షి, వరలక్ష్మి, ముంతాజ్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**తో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించార

రైతులకు ద్రోహం చేసిన కేంద్రం

- సంయుక్త కిసాన్‌మోర్చా ధర్నాలో వక్తలు
- రాజ్‌భవన్‌కు బయలుదేరిన రైతులను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేంద్రం మోసం చేసిందని సంయుక్త కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాజ్యాంగ దినోత్సవం రోజున సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యాన విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వినతిపత్రం తీసుకునేందుకు రాజ్‌భవన్‌ను నుంచి అనుమతి రాకపోవడంతో రైతు సంఘాల నాయకులు ప్రదర్శనగా బయలుదేరారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఐదుగురికి అనుమతివ్వడంతో నాయకులు వెళ్లి గవర్నర్ కార్యదర్శి సిసోడియాకు వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు నిరసన కార్యక్రమం వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ఇవ్వాలని కోరారు. రైతుల ఆందోళన సందర్భంగా వారికి ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా కేంద్రం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోందని వివరించారు. జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించకపోతే రైతులకు న్యాయం జరగదని తెలిపారు. కేంద్రం రైతులను అడ్డం పెట్టుకుని పబ్బం గడుపుకుంటుందని వివరించారు. రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరితే ఇవ్వని కేంద్రం, ఆదానీలు అడిగినంత ధరలకు అనుమతి ఇచ్చేస్తోందని, ఇంతకంటే న్యాయం మరొకటి లేదని అన్నారు. రైతులకు ధర పెరగకపోగా అదానీ, అంబానీ ఆస్తులు మాత్రం అంతకంతకూ పెరుగుతున్నాయని వివరించారు. దీనిపై ఎంపిలను కలిసి వినతిపత్రం సమర్పించే సమయంలో కచ్చితంగా వారి పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతుల సమస్యల పరిష్కారం ప్రధాన అంశంగా ఉండేలా చూడాలని, లేనిపక్షంలో రైతులెవరూ ఓట్లు వేయబోమని ఖరాఖండిగా చెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని అన్నారు. రైతుల బాధలు పట్టని కేంద్రం మెడలు వంచాలని తెలిపారు. తెలుగు రైతు అధ్యక్షులు ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతాంగం నిర్వహించే పోరాటాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రైతు సంఘం నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ లిఖిత పూర్వక హామీనిచ్చి ఇంతవరకు అమలు చేయకపోవడం అన్యాయమని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన వై.కేశవరావు మాట్లాడుతూ కేంద్రం గత ఏడాది కాలంలో రైతులకు అన్యాయం చేస్తూ ఉద్ధరిస్తున్నామని అబద్దాలు ప్రచారం చేస్తోందన్నారు. పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, రైతు నాయకులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, ఎం.వెంకటరెడ్డి, లలితకుమారి, మరీదు ప్రసాదు, రంగారెడ్డి, ఎం.ఉమామహేశ్వరరావు, ఎం.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి

గ్రౌండ్ ట్రుతింగ్ పనులు పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలం దిగువపడు గ్రామంలో సోమవారం సర్వే పనులు ప్రారంభిస్తున్న తరుణంలో వారం లోపు గ్రౌండ్ ట్రుతింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సర్వే కి సంబంధించిన పనుల మీద మండల రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులతో జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సర్వే పనులలో భాగంగా మొత్తం 10 టీమ్‌లు ఉంటాయని అందులో ఇద్దరు విలేజ్ సర్వేయర్ లు, ఒక విఆర్ఓ ,ఇద్దరు విఆర్ఎలు ఉంటారని అన్నారు. ఒక టీం వాళ్ళు ఫీల్డ్ ఎంజాయ్‌మెంట్ పనులు చేయగా మరొక టీం వాళ్ళు రోవర్‌తో కో ఆర్డినేషన్ పనులు చేస్తారని అన్నారు. పనులు ప్రారంభించే ముందు రోజు గ్రామస్థులకు నోటీస్ లు ఇవ్వాలని, పనులు చేస్తున్న సమయంలో వారు ఆ ప్రదేశంలో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మీరు ఇచ్చే ప్రతి నోటీస్ కూడా వరుస క్రమంలో ఏర్పాటు చేసే విధంగా చూసుకోవాలని అన్నారు. మీకు కేటాయించిన స్థలంలో ఇటిఎస్ మెషిన్ ద్వారా డేటా పాయింట్స్ కలెక్ట్ చేసుకుని అసుమ్ట్ పాయింట్స్ నీ కో ఆర్డినేట్ చేయాలి. ఇటిఎస్ మెషిన్ ఉపయోగించే సమయంలో మెషిన్ ను ఉత్తరం వైపున పెట్టి బబుల్ కూడ కదలకుండా చూసుకోవాలని అన్నారు.. గ్రౌండ్ ట్రూతింగ్ పనులు వారం రోజుల లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రొబేషనరీ డెప్యూటీ కలెక్టర్లు ఎన్.మనోజ్ రెడ్డి, జి.వి.రమణ కాంత్ రెడ్డి, కర్నూలు ఆర్డిఓ హరి ప్రసాద్, మండల రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపును పర్యవేక్షించుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: ప్రతి ఒక్కరూ తమ కంటి చూపును పరిరక్షించుకోవాల్సిన అవసరం తప్పనిసరిగా ఉందని కర్నూలు మండల మాజీ వైస్ ఎంపిపి డి వాసు అన్నారు. శనివారం కర్నూలు మండలం, ఉల్చాల గ్రామం, ఎంపిపి రెగ్యులర్ పాఠశాలలో కర్నూలు శాంతిరాం లేజర్ కంటి వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ వైస్ ఎంపిపి డి.వాసు ప్రారం భించారు. ప్రజలు కంటి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షల ద్వారా పరిరక్షించు కోవాలని కోరారు. గ్రామంలో పేదలకు ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించ డానికి ముందుకు వచ్చిన కర్నూలు శాంతిరాం లేజర్ కంటి వైద్యశాల వారిని అభినందించారు. వైద్య సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో అభివద్ధి పనుల వేగం పెంచండి

నోడల్ ఆఫీసర్ ఐఎఎస్ అధికారి మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కర్నూలు మెడికల్ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నోడల్ ఆఫీసర్ ఐఎఎస్ అధికారి మురళీధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఎపిఎం ఎస్ఐడిసి ఎస్ఇ చాంబర్లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల , కర్నూలు వైద్య కళాశాల నోడల్ ఆఫీసర్ డి.మురళీధర్ రెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ .మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రి , వైద్య కళాశాలలో నాడు – నేడులో భాగంగా నిర్వహిస్తున్న పనుల గురించి ఆరా తీశారు. ఆసుపత్రి పనులు యుద్ధప్రాతిపదికన జరగాలని, రెండు మూడు నెలల్లో ఆసుపత్రి రూపురేఖలు మార్చనున్నట్లు తెలిపారు. ముఖ్యమైన పనుల గురించి ఆ శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆసుపత్రిలో నూతనంగా నిర్మించనున్న డయాగ్నోస్టిక్, ఐపి బ్లాక్, బయో మెడికల్ వేస్ట్ పనులను పర్యవేక్షించారు. మెడికల్ కాలేజీలో నూతనంగా నిర్మించనున్న ఆడిటోరియం లెక్చరర్ గ్యాలరీ పనులను కూడా సమీక్షించి వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ పనులను కూడా ఈ సమావేశంలో ప్రస్తావించారు. ఇక నుంచి వేగంగా ఆసుపత్రి , మెడికల్ కాలేజీల పనులను సమీక్షిస్తామని పనులు త్వరగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంఇ సూపరిం టెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి, వైద్య కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ పి హరి చరణ్, ఏ పి ఎం ఎస్ ఐ డి సి ఎస్ ఈ రమేష్ రెడ్డి, డిఇ రాజగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

భారత రాజ్యాంగ దినోత్సవం , జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలోని మాధవి నగర్‌లో మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తన స్వగృహంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి కాకరవాడ వెంకట స్వామి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శివరాజ్ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న గౌస్ దేశాయి, నారాయణ , తదితరులు

పేపర్ మిల్ కార్మికుడి మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

కర్నూల్ మండలం, గొందిపర్ల గ్రామంలోని పేపర్ మిల్లు కార్మికుడు కురువ శివరాజ్ (61) మృతికి సిపిఎం నాయకులు నివాళులు అర్పించారు. శివరాజ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. ఆయన పేపర్ మిల్లులో లోడింగ్ అన్‌లోడింగ్ లో కార్మికుడిగా పనిచేస్తూ చివర వరకు సిపిఎం పార్టీకి సానుభూతి పరునిగా ఉన్నారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ, గొందిపర్ల శాఖ సభ్యులు ,మాజీ సర్పంచ్ జి. ఆంజనేయులు, శ్రీరాములు, కృష్ణ, తాండ్రపాడు సర్పంచి ఎస్ బాలపీర, ఎమ్మెస్ బాబు, పి.బి హుస్సేనయ్య, మునుస్వామి, మద్దిలేటి, గోపాలు బిసన్న ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్

వైసిపితో జనరంజకం పాలన : ఎమ్మెల్యే సుధాకర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జనరంజక పాలన వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు మండలం తొలిసాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రతి గడపను తాకుతూ ప్రభుత్వ ద్వారా అందిన సంక్షేమ పథకాల లబ్ధిని గురించి లబ్ధిదారుల కుటుంబాలకు వివరించారు. బెనిఫిషరీ బుక్‌లెట్‌ను వారికి అందజేశారు. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ప్రజల వద్దకే తీసుకెళ్తున్నామన్నారు. మూడేళ్ల పాలనలో ఒక్కో కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ. 8 లక్షల దాకా లబ్ధిని చేకూర్చామన్నారు. ప్రతిపక్ష నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే ఎన్నికల్లో గెలుపు వైసిపిదేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యేకు స్థానిక వైసిపి నాయకులు ప్రజలు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. కర్నూలు ఎంపిపి డి.వాసు వెంకటేశ్వరమ్మ వైస్ఎంపీపీ నెహెమ్యా జెడ్పిటిసి ప్రసన్న కుమార్, సహకార సొసైటీ చైర్మన్లు అమర్నాథరెడ్డి, శేషారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ డి.వాసు, ఎంపిడిఒ భాస్కర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఇకి వినతిపత్రం ఇస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

దర్గా సందల్ వేడుకల్లో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి కర్నూలు క్రైం

రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ శుక్రవారం రాత్రి కర్నూలు నగరంలోని హజ్రాత్ సయ్యద్ షా మాసూమ్ బాషా సాహెబ్ చిస్తీ దర్గా సందల్ వేడుకల్లో దర్గా పీఠాధిపతులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముతవల్లి మహమ్మద్ ఫరూక్ షా సహాబ్ , నాదీర్ షా సహాబ్, మత పెద్దలు, పీఠాధిపతులు, సయ్యద్ షఫీ పాషా సాహెబ్, అబిద్ హుస్సేని సాహెబ్ , సయ్యద్ ఇలియాజ్ ఖాద్రి , ఆసిఫ్ అలీ ఖాన్, రాజా అలీ ఖాన్, కార్పొరేటర్లు యూనుస్ బాషా, నవీన్, రియాజ్ బాబా పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్ : 73 వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 33 వ వార్డులోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఘనంగా సంబరాలు నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే పలువురు ప్రజాప్రతినిధులు, ఎస్‌సి విభాగం నాయకులు, లీగల్ సెల్ నాయకులు డా బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి ఒకరికొకరు తినిపించుకుని శుభాకాంక్షల తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, స్థానిక వార్డ్ కార్పొరేటర్ మైతాపు నరసింహులు, కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్ రెడ్డి, పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సి సెల్ శివ సందేపోగు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు సాపురు మాధురి, కాశపోగు జయరాముడు, సంగాల సుదర్శన్ రెడ్డి, నారాయణరెడ్డి,నాగ లక్ష్మీరెడ్డి, వైజా బాలచంద్రా రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంఆర్.కష్ణ, వైసిపి లీగల్ సెల్ నాయకులు కర్నాటి పుల్లారెడ్డి,యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతు రెడ్డి, నంద్యాల పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యార్థి విభాగం కురువ శివ, నాయకులు రంగప్ప, మంచాల సుధాకర్ రెడ్డి, సుభాన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న వైసిపి నాయకులు

మార్చి చివరి వరకు హంద్రినీవా నీళ్లివ్వండి

ఎస్ఇకి ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి- కర్నూలు అగ్రికల్చర్

హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా మార్చి చివరి వరకు నీళ్లు ఇచ్చి రైతుల పంట పొలాలను కాపాడాలని ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శిగిడ్డయ్య, ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. జగన్నాధం, సహాయ కార్యదర్శులు ఎం.జగదీష్, రాజా సాహెబ్, విరుపాక్షి లు కోరారు. శనివారం హంద్రీ నీవా ఎస్ఇ రామగోపాల్‌కు సిపిఐ, రైతుసంఘం బృందం కలసి రైతుల సమస్యలను వినతిని అందించారు. శ్రీశైలం ప్రాజెక్టు 215 టిఎంసి ల సామర్థ్యం కు గాను ప్రస్తుతం 150 టిఎంసిలు నిల్వ ఉందని, రాయలసీమకు 40 టిఎంసిలు ఉపయోగించుకునేలా డిజైన్ చేశారన్నారు. ప్రస్తుతం 11టిఎంసిల నీరు వాడుకున్నారని, ఇంకా 29 టిఎంసిల వాడుకునే హక్కు,అవకాశం ఉన్నదని వారు పేర్కొన్నారు. గడప గడప కార్యక్రమంలో దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో పాల్గొన్న కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయారాం మార్చి చివరి వరకు నీళ్లు ఇస్తామని ప్రభుత్వం తరుపున రైతులకు హామీ ఇచ్చారన్నారు. ఆలూరు, పత్తికొండ రెండు నియోజకవర్గాల రైతులు హంద్రీనీవా ప్రాజెక్టు నీటిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు.

అన్న క్యాంటీన్లను మళ్లీ ప్రారంభించండి : టిజి. భరత్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

అన్న క్యాంటిన్లు లేకపోవడంతో పేదలు ఫించన్ దారులు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారని టిడిపి కర్నూలు ఇన్చార్జి టిజి భరత్ అన్నారు. శనివారం 50వ వార్డు కొత్తపేటలో ఒకరోజు అన్న క్యాంటీన్ ప్రారంభించి పేదలకు అన్నదానం చేశారు. టి జి భరత్ మాట్లాడుతూ పించన్ తీసుకునే వృద్ధులు, వితంతువులు, వికలాంగులు అన్న క్యాంటిన్ల ద్వారా కేవలం రూ. 5 చొప్పున రూ. 450 కే మూడు పూటలా నెల రోజులపాటు అన్నం తినేవారని అన్నారు. ప్రభుత్వానికి అన్న క్యాంటిన్ల విలువ తెలియజెప్పేందుకే నగరంలోని అన్ని వార్డుల్లో ఒక్క రోజు అన్న క్యాంటిన్ పెట్టి ప్రజలకు ఉచితంగా అన్నం పెడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటిన్ పథకంలో ఏమైనా లోపాలుంటే సరిచేసి మళ్లీ వీటిని ప్రారంభించాలన్నారు. వార్డు ఇంచార్జి మణిశంకర్ నాయుడు, నేతలు దశరథరామనాయుడు, వెంకటేశ్వర్లు, రుద్రప్ప, ఎల్లరాజు, రాకేష్, మద్దిలేటి, కిరణ్, పాల్ రాజ్, వినోద్, శ్రీధర్ పాల్గొన్నారు.

వైసిపి తోనే అభివృద్ధి సాధ్యం : హఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వైసిపి తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ.హాఫిజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం జొహరాపురం 18వ వార్డు 44వ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ. హాఫిజ్ ఖాన్ పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి గడప తిరుగుతూ వివరించారు. వార్డులో ప్రజలు చిన్న చిన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వాటిని అక్కడే ఉన్న అధికారులకు తెలిపి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రజలతో మమేకమయ్యామన్నారు. గతంలో తెలుగుదేశం నాయకులు ఓట్ల కోసం మాత్రమే ప్రజల వద్దకు వచ్చేవారని, గెలిచిన తర్వాత పట్టించుకో లేదన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన అందించే విధంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలు కూడా సంక్షేమ పథకాల వల్ల ఎంతో సంతోషంగా ఉన్నారని గడప గడప కార్యక్రమంలో ప్రజలు చూపుతున్న ఆదర అభిమానానికి ఎంతో సంతోషంగా ఉందన్నారు. వచ్చే 2024 ఎన్నికలలో కూడా వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తెలియజేశారు. స్థానిక నాయకులు 18వ వార్డ్ కార్పొరేటర్ పల్లవి, అక్బర్, లేపాక్షి, చెన్నమ్మ, సూర్యా, మోహన్, చందు, నాగేంద్ర, విజయలక్ష్మి, దూదేకుల ఖాసీంవలి, ఫాతిమా, తస్లీమ్ భాను, గారిబా, జనార్దన్ గౌడ్, మద్దిలేటి, వెంకటేశ్వరమ్మ, చిన్న బాబు, షకీల్, వాలి, నూర్, డి.ఈ రవి ప్రకాష్ నాయుడు , ఎఇ.జనార్దన్ , ఇంచార్జి ఎఇ. రామ్ మోహన్ , వాటర్ ఎఇ రచ్చయ్య , జగదీశ్ , సచివాలయం సిబ్బంది విద్యుత్ సిబ్బంది వాలంటీర్లు ఆర్పీలు ఓబీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

ఉడ్‌బాల్ పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న కైపపద్మలత

సౌత్ జోన్ ఉడ్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కెవి సుబ్బారెడ్డి కళాశాల ప్రాంగణంలో మొదటి సౌత్ జోన్ సీనియర్ స్త్రీ, పురుషుల ఉడ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా 17 వార్డ్ కార్పొరేటర్ కైప పద్మలత హాజరయ్యారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని, పలు క్రీడా పోటీలకు సుబ్బారెడ్డి కళాశాల వేదికగా నిలవడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ పోటీలలో రాణించి విజేతలుగా నిలవాలని తెలిపారు. శ్రీ లక్ష్మి క్రెడో పాఠశాల ప్రిన్సిపల్ టి. శ్రావ్య లక్ష్మి మాట్లాడుతూ క్రీడలు ఆడటం వలన ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. క్రీడల ద్వారా పొందే ప్రశంస పత్రాల ద్వారా విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, చిన్నప్పటి నుంచి క్రీడలు ఆడటం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జోసెఫ్ లక్ష్యయ్య ప్రసంగిస్తూ ఉడ్‌బాల్ క్రీడ స్కూల్ గేమ్స్‌లో కూడా చేర్చారని, త్వరలో రాష్ట్రస్థాయి ఉడ్‌బాల్ పోటీలు కర్నూలు నగరంలో నిర్వహించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రముఖ డాక్టర్ రమేష్, పోటీల నిర్వహకుడు ప్రభాకర్, వివిధ రాష్ట్రాల కార్యదర్శులు, కోచులు, మేనేజర్లు, క్రీడాకారులు హాజరయ్యారు.

ఉడ్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు సుధాకర్‌బాబు

చట్టాలను నిర్వీర్యం చేస్తున్న పాలకులు

డిసిసి అధ్యక్షుడు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజా సంక్షేమం కోసం రూపొందించిన చట్టాలను నేటి పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు విమర్శించారు. శనివారం స్థానిక డిసిసి కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని రాజ్యాంగం ముందున్న సవాళ్లు అన్న అంశంపై మేధావులు రాజ్యాంగ పరిరక్షణ నిపుణులు కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు ఏకపక్షంగా నియంతల మాదిరి పాలిస్తున్నారన్నారు. ప్రశ్నించిన వారిపైన తప్పుడు కేసులను కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జాన్ విల్సన్, సి.అశోక రత్నం,దామోదరం రాధాకృష్ణ, బి.బతుకన్న, డాక్టర్ అమరేందర్ రెడ్డి, సాంబశివుడు పాల్గొన్నారు.

మీ సమయస్ఫూర్తే ప్రాణాలను కాపాడుతుంది

కిమ్స్ హాస్పిటల్‌లో అవయవదానంపై శిక్షణలో డాక్టర్ రాంబాబు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

బ్రెయిన్ డెత్ అయిన అత్యవసర సమయాల్లో అవయవదాన సమన్వయకర్తల సమయస్ఫూర్తే ఇతరుల ప్రాణాలు కాపాడుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవన్ దాన్ సమన్వయ కర్త డాక్టర్ రాంబాబు సూచించారు. జాతీయ అవయవదాన దినోత్సవం పురస్కరించుకొని కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణకు హైదరాబాద్, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, రాయలసీమలోని అన్ని ఆస్పత్రుల అవయవదాన సమన్వయ కర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన్‌దాన్ వల్ల ఎంతో మంది చనిపోయే దశ నుండి ఆయువు పోసుకొని మంచి భవిష్యత్తును ఆనందిస్తున్నారన్నారు. జీవన్ దాన్ చట్టం అందులోని అన్ని వివరాలను తెలిపారు. బ్రెయిన్ డెత్, లైవ్ ఆర్గాన్ డ

ప్రజాశక్తి
ఆదివారం 27 నవంబర్ 2022
5
నంద్యాల



ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్ల నరసింహ

ప్రజాశక్తి - నంద్యాల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కచ్చితంగా ఇవ్వాలని, అప్పుడే రాష్ట్రం బాగుపడుతుందని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. విభజన చట్టంలోని హామీలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల పట్టణంలోని నిశాంత్ రెవెన్యూ భవనంలో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. నేడు ఢిల్లీలో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని చేపట్టిన కార్యక్రమానికి మద్దతుగా నంద్యాలలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. బిజెపి నాడు ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చాక ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక హోదా విషయం మాట్లాడడం లేదని అన్నారు. నూతన ఎపికి అధికార వైసిపి, ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీలు ప్రత్యేక హోదా తీసుకురావడం విషయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయాయని అన్నారు. ప్రత్యేక హోదా విషయంలో బిజెపి ప్రభుత్వాన్ని అడగడంలో వైసిపి, టిడిపిలు ఎపికి పెద్ద ద్రోహం చేశాయని విమర్శించారు. ప్రత్యేకహోదా, ప్రభుత్వ సంస్థలు ప్రైవేట్ పరం అవుతున్నా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంలో వైసిపి చేతగాని తనానికి నిదర్శనమని అన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం చేస్తుంటే 60 వేల మంది కార్మికులు 6 నెలల నుంచి ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని అనేక రకాల రూపంలో ధర్నాలు చేస్తున్నా వైసిపి బిజెపికి వత్తాసు పలకడం సిగ్గుచేటని అన్నారు. అలాగే విశాఖపట్నంకు ప్రధాని నరేంద్ర మోడీ వచ్చినప్పుడు ప్రత్యేక హోదాపై మాట మాత్రమైనా ఎత్తకపోవడం దారుణమని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమైందని, కనీసం నిధులు కూడా ఇచ్చే పరిస్థితి కనబడడం లేదన్నారు. అలాగే పోలవరం ముంపు బాధితులకు నష్టపరిహారం ఇవ్వడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మోసం చేశాయని విమర్శించారు. విశాఖ రైల్వే జోన్ మాటే ఎత్తలేదని, రాష్ట్రం విడిపోయిన తర్వాత ఎపిలోనిఅన్ని జిల్లాలు బాగుపడాలంటే జిల్లాకు వంద కోట్లు కూడా నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. కడప స్టీల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారనుకుంటే ఆ మాట కూడా ఎత్తలేదన్నారు. అలాగే రైల్వే వ్యాగిన్ పరిశ్రమకు శంకుస్థాపన చేసి వదిలేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటనలో ఏమీ మాట్లాడక పోవడం బాధాకరమని, అలాగే రాష్ట్ర సిఎం జగన్మోహన్ రెడ్డి అడగకపోవడం దారుణ మన్నారు. ఎపికి ప్రత్యేక హోదా కచ్చితంగా ఇవ్వాలని, అప్పుడే రాష్ట్రం బాగుపడుతుందని అన్నారు. విభజన చట్టంలోని హామీలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో దశల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆవాజ్ జిల్లా కన్వీనర్ ఎస్ మస్తాన్ వలి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి లక్ష్మణ్, కెఎండి గౌస్, సహాయ కార్యదర్శి తోట మద్దులు, ఐద్వా జిల్లా అధ్యక్షులు టి.నిర్మల, ముస్లిం జెఎసి కన్వీనర్ అతావుల్లా ఖాన్, కోకన్వీనర్ గన్ని కరీం, సిపిఐ ఎంఎల్ రెడ్‌స్టార్ కార్యదర్శి గాలి రవిరాజు, సిపిఐఎంఎల్ జిల్లా నాయకులు చౌడప్ప, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు శేషు, జెవివి రామరాజు, ఐయూఎంఎల్ సాదిక్, జాను జాగో సయ్యద్ మహబూబ్ బాషా, జనసేన సందీప్, నాయకులు సుబ్బారావు, సాయి, మాభాష, భాస్కర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'నీటి'పై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

శ్రీశైలం జలాశయం నీటి మట్టం 875.300 అడుగులకు చేరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వివిధ సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రోజుకు 3 నుంచి 5 టిఎంసిలు వాడుతున్నాయి. దీంతో రోజు రోజుకూ జలాశయంలో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. నీటి వినియోగం ఇలాగే కొనసాగితే డిసెంబరు ఆఖరుకు లేదా జవనరి 15నాటికి 798 అడుగులు దిగువకు పడిపోయే అవకాశం ఉంది. జలాశయంలో 810 అడుగుల లెవల్ వరకు మాత్రమే హంద్రీ నీవా, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల నుంచి నీరు ఎత్తిపోసే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో జవనరి తరువాత హంద్రీ నీవా కాలువకు నీరు ఇచ్చే అవకాశమే లేదని పత్తికొండ, దేవనకొండ, గోనెగండ్ల, కృష్ణగిరి, తుగ్గలి మండలాల తహసీల్దారులకు ఇరిగేషన్ అధికారి లేఖ రాశారు. గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో ఈ మేరకు నోటీసులు అంటించాలని, దండోరా వేయించాలని ఆ లేఖలో ఆదేశించారు. హంద్రీనీవా ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 11.5 టిఎంసిలే ఎత్తిపోశారు. గత టిడిపి ప్రభుత్వంలో ఐదేళ్లు సగటున 30-35 టిఎంసిల వరకు కృష్ణా జలాలు ఎత్తిపోసి కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని కరువు పల్లెలకు ఫిబ్రవరి, మార్చి ఆఖరు వరకు సాగు, తాగునీరు ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక కూడా 2020లో 40 టిఎంసిలు, 2021లో 28 టిఎంసిలు ఎత్తిపోశారు. కృష్ణగిరి, జూపాడుబంగ్లా, పత్తికొండ, వెల్దుర్తి, కల్లూరు, మద్దికెర మండలాల్లో హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి మోటర్ల ద్వారా ఎత్తిపోతలు, పందికోన జలాశయం పరిధిలో దేవనకొండ, పత్తికొండ మండలాల్లో దాదాపుగా 35 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగులో ఉన్నాయి. రబీ ఆశతో నెల నెలన్నర రోజుల క్రితమే వేరుశనగ, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారు.

చలి పంజా : జిల్లాలో చలి పంజా విసురుతోంది. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగింది. రెండ్రోజుల కిందట రాత్రివేళల్లోనే చలి ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఉదయం కూడా ప్రభావం చూపుతోంది. రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు బయటికి రావాలంటే ప్రజలు గజగజ వణికిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచి రోడ్లను మంచు కప్పివేస్తోంది. చలికాలంలో చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు పలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, ఆస్తమా, గుండె సంబంధ వ్యాధులు ఉన్న వాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. చలికి బయట తిరగకుండా జాగ్రత్తగా ఉండాలని, ఇంటిలోనూ చలి తీవ్రత పెరిగితే వేడి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

బకాయిలపై ఆందోళన : తమ ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటూ ఒకవైపు బూటకపు ప్రచారం చేసుకుంటూ మరోవైపున ఉద్యోగులకు ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయడం లేదు. ఉద్యోగులకు ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన న్యాయబద్ధమైన అరియర్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా అలసత్వం వహిస్తోంది. మరోవైపున సంక్షేమ పథకాలకు మాత్రం పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేస్తోంది. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు ఇతరత్రా ఆర్థిక పరమైన బిల్లులను చెల్లించడం లేదు. బకాయిలు విడుదల చేయాలని యుటిఎఫ్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన పిఆర్‌సి వల్ల ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదని నాయకులు పేర్కొన్నారు.

పాత జాబితాకే : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో చేపట్టిన అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టుల నియామకాల్లో భారీగా అవకతవకలు చోటుకున్నట్లు ఆరోపణలు రావడంతో దానిపై మెరిట్ జాబితాలో పేర్లు లేని వారు, ఉన్న వారు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పాత మెరిట్ జాబితాకే హై కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో నియామకాలపై మళ్లీ ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల రామకృష్ణ పిజి కళాశాల శ్రీ కాశిరెడ్డి నాయన ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన రెండవ రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలు శనివారం ఉత్కంఠగా సాగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వచ్చిన దాదాపు 1000 మంది టైక్వాండో క్రీడాకారులు హోరా హోరీగా తలపడ్డారు. శనివారం సాయంత్రానికి అన్ని విభాగాలు పోటీలు ఫైనల్ దశకు చేరుకున్నాయి. ఆదివారం జరిగే అన్ని విభాగాల ఫైనల్ పోటీలలో విజేతలకు అదే రోజు సాయంత్రం పతకాలు, యోగ్యత పత్రాలు అందజేస్తారు. పోటీలను రాష్ట్ర సంఘం తరఫున ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి నాగూర్ బాబు సర్దార్ ఫర్హతుల్లా మహబూబ్ బాషా, దాదాపు 50 మంది రెఫరీలు పర్యవేక్షించారు.

తైక్వాండో పోటీలో తలపడుతున్న

28న రైతుల ఖాతాలో ఇన్‌పుట్ సబ్సిడీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతాంగానికి ఈనెల 28న రాష్ట్ర ప్రభుత్వం ఇన్ పుట్ సబ్సిడీని లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనుంది. సోమవారం ముఖ్యమంత్రి వర్చువల్ ద్వారా ఈ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. నంద్యాల జిల్లాలో 3,246 మంది రైతులకు దాదాపు రూ.2 కోట్ల 41 లక్షలు 60 వేలు, ఉద్యాన పంటల కింద 687 మంది రైతులకు రూ.75.96 లక్షలు, ఖరీఫ్‌లో పడని సొమ్మును కూడా 1339 రైతులకు రూ.1,11,3 9 కోట్లు ఇన్ పుట్ సబ్సిడీని జమ చేయనున్నారు. అలాగే సున్నా వడ్డీ పంట రుణాలను 2020-21 బ్యాంకులో రుణాలు తీసుకొని కట్టిన రైతులు 19,191 మందికి రూ.2.45 కోట్లు, 2021లో పెండింగ్‌లో ఉన్న పాత క్లెంట్లకు 25,550 రైతులకు రూ.5.67కోట్లు, పేమెంట్ క్లెయింట్స్ 36,553 రైతులకు రూ.812 కోట్లు మొత్తం 16.24 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

మున్సిపల్ ఆఫీసులో ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డిలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రం సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. గత మూడు నాలుగు ఏళ్లుగా సేవలు లేకపోవడంతో మూతపడిందని, అయితే ఆధార్ నమోదు కోసం కమిషనర్‌కు ప్రజలు అర్జీలు పెట్టుకోవడంతో ఏర్పాటుకు కమిషనర్ చర్యలు చేపట్టారన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఇంకా ఆధార్ నమోదు చేసుకుని వారు మున్సిపల్ కార్యాల యానికి వచ్చి ఆధార్ కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహబూబ్ వలి, కృష్ణమోహన్, చంద్ర, మున్సిపల్ ఇంజనీర్లు జయ భారత్ రెడ్డి, మధు కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్

తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించండి

- బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోండి
- ఎలెక్ట్రోరల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఓటర్ల జాబితాలో తప్పొప్పులు లేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎలెక్ట్రోరల్ అబ్జర్వర్ డి. మురళీధర్ రెడ్డి సూచించారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంపై ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, అన్ని నియోజకవర్గాల ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తప్పొప్పులు లేని ఓటర్ల జాబితానే కీలకమని అన్నారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు ఎలెక్ట్రోరల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఇందుకోసం రాజకీయ పార్టీలు బిఎల్ఓల తరహాలోనే బూత్ స్థాయి ఏజెంట్లను కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం సూచించిన షెడ్యూల్ ప్రకారం 1-1-2023 నాటికి 18 సంవత్సరాల నుండి కొత్తగా ఓటు హక్కుకు నమోదు చేసుకున్న ఫారం-6, 6ఎ, 7, 8 ఇతర అభ్యంతరాలను డిసెంబర్ 8వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. స్వీకరించిన క్లెయిమ్‌లన్నింటినీ డిసెంబర్ 26లోగా విచారించి అర్హులైన ఓటర్లను జాబితాలో నమోదు చేసి వచ్చే ఏడాది జనవరి 5న తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. తప్పొప్పులు లేని ఓటర్ల జాబితా, ప్రశాంత ఎన్నికల నిర్వహణ సంబంధిత అంశాలపై రోల్ అబ్జర్వర్‌గా మూడు పర్యాయాలు జిల్లాలో పర్యటిస్తానని చెప్పారు. ఇందులో భాగంగానే నేడు రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించామన్నారు. ఓటర్ల జాబితా రేషియోలో జిల్లా ఆవరేజ్ ఒక శాతం, నియోజకవర్గ ఆవరేజ్ 3 శాతం డీవియేషన్ వున్నా క్షుణ్ణంగా పర్యవేక్షించాలని భారత ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై కూడా తనిఖీలు నిర్వహించాలన్నారు. అసాధారణ రీతిలో వచ్చే క్లెయిమ్స్‌పై మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా తప్పొప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేస్తామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుంచి సయ్యద్ రెహ్మాన్ భాష, టిడిపి జి. శ్రీనివాసులు, వైసిపి అమృతరాజ్, రామిరెడ్డి, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఎఈఆర్వోలు

మాట్లాడుతున్న ఎలెక్ట్రోరల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

డిసిఎంఎస్ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని కోర్టు సమీపంలో డిసిఎంఎస్ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే కాటసాన రామిరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ సిహెచ్ శిరోమణిలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి డిసిఎంఎస్ కార్యాలయంకు సొంత భవనం లేక సిబ్బంది ఇబ్బందులు పడ్డారని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డిసిఎంఎస్‌కు నూతన భవనాలను మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య, డిసిఎంఎస్ మేనేజర్ శంకర్, ఇల్లూరు కొత్తపేట సర్పంచి రమణ, వైసిపి నాయకులు మల్లికార్జునరెడ్డి, బండి బ్రహ్మానంద రెడ్డి, డిసిఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

30న విద్యార్థులకు ప్రోత్సాహక పోటీలు

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సుప్రీం కోర్టు వారి ఆదేశాల మేరకు, నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ, ఎపి స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ వారి ఉత్తర్వుల ప్రకారం కోవెలకుంట్ల కోర్టు ఆవరణలో విద్యార్థులకు ప్రోత్సాహక పోటీలను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు కోవెలకుంట్ల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ రహమాన్ తెలిపారు. 7వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, 8, 9, 10 తరగతి విద్యార్థులకు "రాజ్యాంగంలోని మానవహక్కులు" అంశంపై వ్యాసరచన పోటీలు, డిసెంబర్ 1న ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు, 'భారత రాజ్యాంగం-మహిళల హక్కులు' అంశంపై చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా పి.నరహరి

ప్రజాశక్తి - శిరివెళ్ల

శిరివెళ్ల మండలం మహదేవపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పిక్కిలి నరహరి ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. పిక్కిలి నరహరి మాజీ ఎంపిటిసిగా, గంగుల అనుచరులుగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అందరికీ సుపరిచితమైన వ్యక్తిగా గుర్తింపు పొందారు. నరహరి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గా ఎన్నికైనందుకు మహదేవపురం సర్పంచి పెద్దింటి రమణయ్య, సర్వ నరసింహస్వామి ఆలయ చైర్మన్ రామాంజనేయ రెడ్డి, మాజీ చైర్మన్ జయ లక్ష్మమ్మ, వైసిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

మండలంలోని జగనన్న కాలనీల గృహ నిర్మాణాలు లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వర రావు సూచించారు. శనివారం మండలంలోని అల్లూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని జగనన్న కాలనీలో 72 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేశామన్నారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో పిఆర్ఎఇ రామకృష్ణారెడ్డి, ఇఎపిఆర్డి వెంకటేశ్వరరావు, ఉపాధి ఎపిఒ రవి ప్రకాష్, విద్యుత్ ఏఇ గుర్రప్ప, కార్యదర్శి రహీం, విఆర్ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని తాసిల్దార్ వెంకట శివ, ఎంపీడీవో మధుసూదన రెడ్డిలు తెలిపారు. హౌసింగ్ డే సందర్భంగా ఎర్రగుడిదిన్నె సచివాలయం పరిధిలోని మాచినేని పల్లె గ్రామం జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న పక్క గహాలను వారు పరిశీలించారు. పిఆర్ఏఇ వెంకటరాముడు, ఆర్డబ్ల్యుసి ఏ ఈ ప్రమోద్, ఉపాధి ఏపీఓ ప్రతాప్, వీఆర్వో వెంకట నారాయణ, కార్యదర్శి జయరాముడు, వర్క్ ఇన్స్పెక్టర్ ఆనంద్, ఇంజనీర్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని తిమ్మనాయునిపేట, కనకాద్రిపల్లి గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ తనిఖీ చేశారు. సచివాలయంలో హౌసింగ్ లబ్ధిదారులతో హౌసింగ్ డే కార్యక్రమం క్రింద అవగాహనా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

నూతన జాయింట్ కలెక్టర్‌గా టి.నిశాంతి

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్ నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా టి.నిశాంతిని నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగంకు బదిలీ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ సబ్ కలెక్టర్‌గా, అనంతపురం హౌసింగ్ జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.నిశాంతిని సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఆళ్లగడ్డ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అనంత విద్యాసంస్థల కరస్పాండెంట్ అనంత రామ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక అనంత జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు కరస్పాండెంట్ అనంత రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎన్నో విషయాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలంకరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ అనంత విజయలక్ష్మి, అధ్యాపకుల బృదం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజలకు మెరుగైన సర్వీసులు అందించండి

- హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ - జిల్లా వ్యాప్తంగా ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రపంచంలోనే భారతదేశ రాజ్యాంగానికి విశిష్ట స్థానం ఉందని, రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రజలకు మెరుగైన సర్వీసులు అందించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ అధికారులను ఆదేశించారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 73 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ప్రధానమంత్రి మొదలుకొని అట్టడుగు స్థాయిలో ఉన్న పౌరుని వరకు సమానమైన న్యాయం అందేలా రాజ్యాంగం రూపొందించారన్నారు. 16, 17వ శతాబ్దాలలో సాధారణ పౌరునికి ఒకలా, ప్రముఖులకు మరోలా న్యాయం ఉండేదని కలెక్టర్ గుర్తు చేశారు. ప్రతి కార్యాలయంలో నిబంధనలకు అనుగుణంగా పని చేస్తే ప్రజల్లో నమ్మకం ఉంటుందని, ఆ నమ్మకాన్ని మరింత పెంచే దిశలో ఉద్యోగులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. 1949లో రూపొందించిన రాజ్యాంగంలోని అంశాలను పరిగణలోకి తీసుకొని నేటి వరకు కూడా ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్పందన కార్యక్రమానికి సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో ప్రజలు వస్తారని, పరిష్కరించే దిశలో అధికారులు కృషి చేసి సంబంధిత అర్జీదారునికి న్యాయం చేయాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నివాసంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషాలు నివాళులర్పించారు. అనంతరం బొమ్మల సత్రంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, రైల్వే డైరెక్టర్ కుమ్మరి రాముడు, మాజీ మున్సిపల్ చైర్మన్ కైపరాముడు పాల్గొన్నారు. **నంద్యాల**లోని బాల అకాడమీ పాఠశాలో కరస్పాండెంట్ ఎంజివి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత అ

కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డిఎస్‌పి సుధాకర్ రెడ్డి

అలజడులు సృష్టిస్తే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - చాగలమర్రి

గ్రామాలలో అలజడులు సృష్టిస్తే చర్యలు తప్పదని ఆళ్ళగడ్డ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో వివిధ గ్రామాల రౌడీషీటర్లు, అనుమానితులకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మట్కా, నాటుసారా, ఎర్రచందనం అక్రమార్కుపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలకు, శాంతి భద్రతలకు విఘాతం కల్గించేలా ఎవరు ప్రవర్తించినా,ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ రాజశేఖరరెడ్డి, ఏఎస్ఐ మేరిజయంతి,హెడ్ కానిస్టేబుల్ బలరాముడు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **డిఎస్‌పికి సన్మానం :** ఆళ్ళగడ్డ డిఎస్‌పి సుధాకర్ రెడ్డిని చాగలమర్రి మండలం హమాలీల సంఘం అధ్యక్షుడు గుత్తి నరసింహులు ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సన్మానించారు .ప్రస్తుత డిఎస్‌పి గతంలో చాగలమర్రి ఎస్ఐగా చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న పిఓ రవీంద్రారెడ్డి

సచివాలయాలను ఐటిడిఎ పిఒ తనిఖీ

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండల పరిధిలోని కురుకుందా, కొట్టాల చెరువు గ్రామ సచివాలయాలను ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి శనివారం ఆకస్మిత తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొట్టాల చెరువు గ్రామ సర్పంచ్ ఉత్తలూరి నాగలక్ష్మి, గ్రామ కార్యదర్శి లక్ష్మీ నరసమ్మ, ఎన్ఆర్ఈజీఎస్ ప్రత్యేక అధికారి కేజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వాలంటీర్ పోస్టులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో మేరీ, ఈవో ఆర్‌డి శ్రీనివాసులు నాయుడు, డిప్యూటీ తహసిల్దార్ మనోహర్‌ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. **ఆత్మకూర్ :** మండల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వాలంటీర్ల పోస్టులకు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మోహన్ కుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. **పాములపాడు :** ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీడీవో నాగ శివ లీల, డిప్యూటీ తహశీల్దార్ వెంకటరమణ, ఏవో కరుణ సాగర్ వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8 పోస్టులకు ఆన్లైన్లో 11 మంది దరఖాస్తు చేసుకోగా.. ఇంటర్వ్యూ కు 9మంది హాజరైనట్లు తెలిపారు. ఎంపిక చేసిన జాబితాను 29వ తారీఖున వెల్లాడించనున్నట్లు ఆమె తెలిపారు. **రుద్రవరం :** రుద్రవరం, ఆలమూరు సచివాలయాలలో ఖాళీగా ఉన్న రెండు వాలంటీర్ పోస్టులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మధుసూదన రెడ్డి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే రెండు పోస్టులకు ఎంపిక చేసి వారికి తెలియజేస్తామన్నారు.

విభజన హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీల అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయాయాన్ని రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పక్షాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జైకిసాన్ పార్కులో సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సిఐటియు జిల్లా నాయకులు కె భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు రమేష్ బాబు, కాంగ్రెస్ ఇంచార్జి సి. అశోక్ రత్నం, టిడిపి క్లస్టర్ ఇంచార్జి న్యాయవాది జాకీర్ హుస్సేన్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు న్యాయవాది సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పీ.వకీర్ సాహెబ్, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, బీసీ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు కురుమూర్తి, మాల మహానాడు తాలుకా అధ్యక్షుడు నాగేష్, బుడగ జంగం నాయకులు రాములింగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. వీటిని సాధించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విఫలమయ్యారని వారు విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తనకు 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్ర ప్రభుత్వ మెడలై ఉంచైనా ప్రత్యేక హోదా సాధిస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి మరచిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి అని వారు విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కాంగ్రెస్, వామపక్షాలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి, యువజన, ఉద్యోగ, కార్మిక, మహిళా సంఘాలు ఐక్యమై ప్రత్యేక హోదా విభజన హామీల సాధనకై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు వేణుగోపాల్, సిఐటియు నాయకులు ఆంజనేయులు, ఆర్, జయ, అబ్దుల్ సలాం, కళాకార్, నాగన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు

లింగ వివక్షను రూపుమాపాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

లింగ వివక్షతను, బాల్య వివాహాలను రూపుమాపాలని ఎంపిడిఒ వెంకటరమణ, ఎంఇఒ సుభాన్, జెడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపిపి మల్లేశ్వరి అన్నారు. శనివారం పగిడ్యాల వెలుగు కార్యాలయంలో ఎపిఎం శ్రీనివాసులు అధ్యక్షతన లింగ వివక్షత,బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి పుల్లయ్య, ఏరియ కో ఆర్డినేటర్ కల్పలతదేవి, ఎఎస్ఐ కృష్ణుడు, సూపర్‌వేజర్ నాగేశ్వరమ్మ, మండల ఉపాధ్యాక్షురాలు పల్లే ఆరుణామ్మ, సర్పంచు పెరుమాళ్ళ శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి : లింగ వివక్ష చూపకూడదని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ అన్నారు. లింగ వివక్షను వ్యతిరేకిస్తూ ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్, వైద్య, వెలుగు, సచివాలయ సిబ్బంది,పొదుపు లక్ష్మి మహిళలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఏపిఎం నాగమ్మ అధ్యక్షతన లింగ వివక్ష, అసమానతలు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు.

కొత్తపల్లి : కూతురైన, కొడుకు అయినా సమానంగా పెంచడంతో పాటు ఇద్దరికీ సమాన అవకాశాలు కల్పించి లింగ వివక్షతను రూపుమాపాలని ఎంపీడీవో మేరీ, ఏపిఎం పుల్లయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రమైన కొత్తపల్లి లో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో లింగ వివక్షతపై మండల స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ, మగ అనే తేడాలు చూడకుండా సమానంగా చదివించాలన్నారు. ఇద్దరినీ సమానంగా పెంచితే ఇద్దరూ అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. డిప్యూటీ తహసిల్దార్ మనోహర్, ఏపీవో శ్రీనివాసులు, జెండర్ సోషల్ యాక్షన్ కమిటీ, అంగన్వాడీ సిబ్బంది, ఏఎస్ఎంలు, సిఆర్‌టిలు పాల్గొన్నారు.

పాణ్యం : సమాజంలో ప్రతి ఒక్కరూ లింగ వివక్షకు ముగింపు పలకాలని ఎంపిపి హుస్సేన్ బీ తెలిపారు. శనివారం పాణ్యం మండల మహిళా సమాఖ్యలో ఏపిఎం ప్రసాద్ అధ్యక్షతన లింగ వివక్షపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపిపి పార్వతి, ఎంపిడిఒ, ఏరియా కోఆర్డినేటర్ బాబురావు, డిఇఒ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అవుకు : అవుకులోని వైకెపి కార్యాలయంలో విఒఎలకు సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అవుకు ఎస్సై జగదీశ్వర్రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ అజామ్ ఖాన్, ఎంఇఒ శ్రీధర్ రావులు పాల్గొని మాట్లాడారు.

పగిడ్యాల : మాట్లాడుతున్న ఎంపిడిఒ

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి : ఎడిఎ

ప్రజాశక్తి - పాములపాడు

రైతులు వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందేందుకు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఏడిఏ ఆంజనేయ అన్నారు. శనివారం నాడు మండలంలోని మిట్ట కందల గ్రామంలో వ్యవసాయ అధికారి పనిశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడిఏ ఆంజనేయ, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత హాజరయ్యారు. ఏడిఏ రైతులకు పలు సూచనలు చేశారు. ఏవోలు హేమలత, పనిశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పంటలకు తెగులు రాకుండా రక్షణ పంటగా గట్ల వెంబడి వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల నారాయణ, ముతుజావలి, రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు తోచిన సాయం చేయాలి

ప్రజాశక్తి - డోన్

వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులకు పుట్టినరోజు లాంటి వేడుకల సందర్భాలలో తమకు తోచినంత సహాయం చేయాలని హోసన్న వృద్ధాశ్రమ నిర్వాహకులు జాన.ప్రభాకర్ కోరారు. శనివారం కొత్తపేటకు చెందిన పద్మాజీరావు సతీమణి ప్రశాంతిబాయ్ రెండవ వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన ప్రభాకర్ మాట్లాడుతూ సందర్భాన్ని బట్టి గుర్తుచేసుకొని ఒక పూట భోజనము పెడితే వారు మనస్ఫూర్తిగా దీవిస్తారని అన్నారు. గురు,సురేఖ భాయ్, సూర్యహర్షఆశ్రమ సూపర్వైజర్ మస్తాన్ బి పాల్గొన్నారు.

బిసిలకు వైసిపి అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి - డోన్

బిసిలకు అన్యాయం చేసిన వైసిపిని గద్దేదించుదాం అని తెలుగుదేశం పార్టి బిసి సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ప్రజా వైద్యశాల బెస్త. మల్లికార్జున పేర్కొన్నారు. బెస్త కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చెయాలని టిడిపి బెస్త సాదికార కమిటి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెస్త షన్ముకం అధ్యక్షతన శనివారం అనంతపురం కలెక్టరేట్ ముందు రిలే నిరహరదీక్షకు బెస్త మల్లికార్జున మద్దతు తెలిపారు. అనంతరం బెస్త మల్లికార్జున మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బిసిలు బ్యాక్ బొన్ అంటూనే వారి నడ్డి విరుస్తోందన్నారు. యాబై అరు బిసి కుల కార్పొరేషన్లు ఏర్పాటుచేశమంటూ గొప్పలు చెబుతుంది తప్ప చిల్లిగవ్వ నిదులు మిగల్చలేదని అన్నారు. కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను ఉత్సవ విగ్రహలుగా మిగిల్చారన్నారు.

తీగెల వంతెన బదులు బ్రిడ్జి కం బ్యారేజీని నిర్మించాలి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా ఆంధ్రా–తెలంగాణా రాష్ట్రాల మధ్య కృష్ణా నదిపై నిర్మిస్తున్న అందమైన తీగెల వంతెన బదులుగా రాయలసీమ దాహార్తిని శాశ్వతంగా నివారించే బ్రిడ్జి కం బ్యారేజ్‌ని నిర్మించాలని రాయలసీమ జెఎసి కోఆర్డినేటర్ కామని వేణుగోపాల్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రాన్ని ఒప్పించి ఇరు రాష్ట్రాలూ ఒప్పుకొని కేంద్రం తన ఖర్చుతో బ్రిడ్జి కం బ్యారేజిని నిర్మింపచేసుకుంటే ఇరు రాష్ట్రాలకూ నీటి ఎద్దడిని పోగొట్టుకున్నట్లు అవుతుందన్నారు. సముద్రంలోకి పోయే దాదాపు 800 నుండి 1000 టిఎంసిల నీటిని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.

విభజన హామీలు అమలు చేయాలి : సిపిఐ

నంద్యాల అర్బన్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో కేంద్రంలోని బిజెపిని, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలే తరిమికొడతారని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ హెచ్చరించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ప్రత్యేక హోదా సాధన సమితి, విద్యార్థి యువజన సంఘాలు. చేస్తున్న ఆందోళనకు సంఘీభావం తెలియజేస్తూ శనివారం పట్టణంలోని సంజీవ్ నగర్ సెంటర్లో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఐ జిల్లా సమితి సభ్యుడు డి. శ్రీనివాసులు, హరినాథ్, పట్టణ సహాయ కార్యదర్శి జి.సోమన్న, ఎపి వ్యకాసం జిల్లా అధ్యక్షుడు. ఏ. సుబ్బరాయుడు పాల్గొన్నారు.

'ఇదేం కర్మ' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

- వై నాగేశ్వర రావు యాదవ్

ప్రజాశక్తి - ప్యాపిలి

టిడిపి చేపట్టిన 'ఇదేం కర్మ' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం అని టిడిపి నాయకులు వై నాగేశ్వర రావు యాదవ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంధ్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఇదేం కర్మ అనే కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ నెలలో చంద్రబాబు నాయుడు చేపట్టనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్ యాదవ్, పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి,నాగేంద్ర, కోదండ రామయ్య యాదవ్, చల్లా వీర, మల్లికార్జున, కదిరప్ప, ఆర్ సి మద్దిలేటి, బలరంగన్న,భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : వ్యకాసం

ప్రజాశక్తి -పాములపాడు

బేతంచెర్లలో ఆదివారం జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శెట్టి బాలయ్య, మండల అధ్యక్షులు ఎస్ ఆర్ రమణ, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, మండల కార్యదర్శి మధు కోరారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు వ్యకాసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు మాహాసభలో భవిష్యత్ కార్యచరణ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రంగస్వామి, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

అక్రమ తవ్వకాలు ఆపాలి

- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ

ప్రజాశక్తి-డోన్

డోన్ మండల పరిధిలో అక్రమ తవ్వకాలు ఆపాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు రంగ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ డోన్ మండల పరిధిలోని ఎర్రగుంట్ల, చిన్న మల్కాపురం,వలసల,కనపకుంట,ధర్మవరం, గ్రామాలలో గల వ్యవసాయ భూమిలో రైతులకి మాయ మాటలు చెప్పి అక్రమ తవ్వకాలు మైనింగ్ కొనసాగిస్తూ ఉన్నారన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ తవ్వకాల్లో ముగ్గురాయి బెరాటిక్స్ ఐరన్ ఓవర్ ఖనిజ సంపదని తోవ్వుకొని సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కులకి అధికారులు వత్తాసు పలుకుతూ ఉన్నారని అన్నారు. గత నాలుగు నెలల నుంచి అక్రమంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్న రెవిన్యూ మైనింగ్ విజిలెన్స్ అధికారులు ఎవరూ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమార్కులు అధికారులను అడ్డుపెట్టుకొని అక్రమ సంపదకు దొడ్డిదారి వెతుకుతున్నారని అన్నారు. ఇలాంటి అక్రమ తవ్వకాలని ఉన్నతాధికారులు వెంటనే అరికట్టకపోతే రైతులని సమీప గ్రామాల ప్రజలని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు చిన్న, సురేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు

ఆటో డ్రైవర్లపై దాడులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

ఆటో డ్రైవర్లపై ఆర్‌టిఎ, పోలీస్ అధి కారులు దాడులు ఆపాలని ఆటో వర్కర్స్ యూనియన్ నంద్యాల జిల్లా నూతన కమిటీ అధ్య క్ష, కార్యదర్శులు రమేష్ బాబు, డి.లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రవాణారంగం పైన కక్షగట్టి పాలన సాగిస్తుందని అన్నారు. ముఖ్యంగా రోడ్డు రవాణా రంగం భద్రతా చట్టం పేరుతో పార్లమెంట్లో బిల్లు చేసి డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడేందుకు సిద్ధమైందని అన్నారు. పోలీసు, ఆర్టీవో అధికారుల వేధింపులు ఆపాలని, ఎక్కడ ఏ చిన్న తప్పిదం జరిగినా ఆటో డ్రైవర్లందరిని నిందించడం సరైంది కాదన్నారు. సమస్యలను పరిష్కారం కోసం ఆటో డ్రైవర్ల అందరూ ఐక్యంగా ఉండి పోరాటానికి సిద్ధం కావాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికక్కడ పోరాటాలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

వైసిపి పాలనలో అవినీతికి స్థానం లేదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలో జగనన్న పాలనలో అవినీతికి దళారీ వ్యవస్థకు స్థానం లేదని ఆళ్ళగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. శనివారం చాగలమర్రి మండలం నేలంపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నారని విమర్శించారు. వైసిపి పాలనలో అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, ఆ పార్టీ మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మండలాధ్యక్షుడు వీరభద్రుడు, గ్రామ సర్పంచ్ ప్రతాపరెడ్డి, వైసీపీ సీనియర్ నాయకుడు ఎంపీటీసీలు పత్తి నారాయణ, బేబమ్మ ,లక్ష్మిరెడ్డి, మల్లె వేముల ఫయాజ్ , నరసింహులు, మండల కో ఆప్షన్ సభ్యులు జిగ్గీ గారి ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** మండలంలోని ముస్తపల్లె గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొని పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు శివశంకర్ రెడ్డి, ఎంపీడీవో, ఎంఈఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.**బనగానపల్లె :** అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాళ్ల కొత్తూరు, రాళ్ల కొత్తూరు తాండా, కాపుల పల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఒ శివరామయ్య, తమ్మడపల్లి సర్పంచి వెంకటరామిరెడ్డి, ఎంపిటిసి రాముడు నాయక్, వైసిపి నాయకులు వెంకటేశ్వర్లు, నామాల మహేష్, కాటసాని రామకృష్ణారెడ్డి, తుకార నాయక్, గోవింద్ నాయక్, లక్ష్మి నాయక్, బాలుడు నాయక్, గంట ఈశ్వర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, శివరాముడు, రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర రెడ్డి అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి, విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, కేంద్ర కాటన్ బోర్డు మాజీ డైరెక్టర్ చింతకుంట్ల శ్రీనివాసరెడ్డి (వాసు), మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, డాక్టర్ సుధామణి, ప్రముఖ వైద్యులు శీలం సురేంద్రనాథ్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రమేష్ గౌడ్, ఏఈ సురేంద్ర, శానిటరీ అధికారి బాలస్వామి పాల్గొన్నారు.

ముస్తేపల్లె గ్రామంలో కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా

ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్.ఏ.శాంతి ని సన్మానిస్తున్న దృశ్యం

ఇన్నర్ విల్ క్లబ్ ఆధ్వర్యంలో

పాఠశాలకు బీరువా అందజేత

ప్రజాశక్తి-డోన్

ఇన్నర్ విల్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలకు బీరువా ను అందించినట్లు ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్.ఏ.శాంతి తెలిపారు. శనివారం డోన్ మండలంలోని మల్లెంపల్లె జడ్పీ హెచ్ హైస్కూల్‌కు ఆర్.శ్రీపల్లిఉమా ఆర్థిక సహకారంతో బీరువాను పాఠశాల హెచ్ఎం పి. మహమ్మద్ ఇబ్రహీంకు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్.ఏ.శాంతి,ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షులు మర్రి సరళ దేవి,అనంతలక్ష్మి లు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. పాఠశాలకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్.ఏ.శాంతిని పాఠశాల బృందం ఘనంగా సన్మానించారు. అనంతరం కబడ్డీ పోటీలలో రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థినీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకరయ్య,శ్రీనివాసులు, రామ్మోహన్, రామాంజనేయులు, రోజారాణి, పద్మావతి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

మండల అధ్యక్షురాలు పోచా రమాదేవి

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మండల అధ్యక్షురాలు పోచా రమాదేవి తెలిపారు. సంజామల మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి విషయాలు ఉన్నా, సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే సున్నా వడ్డీ రుణాలు అందరి ఖాతాల్లో పడతాయని, వాటిని సద్వినియం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు జగనన్న కాలనీలో కరెంటు సమస్య ఉందని, సంబంధిత అధికారులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ మల్లికార్జున రావు, ముక్కామల మాజీ సర్పంచి పోచ వెంకటరామిరెడ్డి, ఆల్వకొండ ఎస్సీ బాబు, ఆకుమల్ల ఎంపీటీసీ కిరణ్ కుమార్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ముదిగేడు రాజశేఖర్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండల అధ్యక్షురాలు పోచా రమాదేవి

రసాబాసగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గడివేముల

గడివేముల మండల పరిషత్ కార్యాల యంలో ఎంపిపి నాగమద్దమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వ సభ్య సమా వేశం రసాబాసగా సాగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరయ